ప్రజాశక్తి

గురువారం 21 నవంబర్ 2024

5

విజయనగరం



23 నుంచి సయ్యద్ ముస్తాక్ అలీ క్రికెట్ పోటీలు


ఎసిఎ కార్యదర్శి సానా సతీష్ బాబు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దేశవాలీ టి20 క్రికెట్ టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ పోటీలు విశాఖపట్నంలోని పిఎం పాలెం అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, విజయనగరంలోని పివిజి రాజు కాంప్లెక్స్, విజ్జి స్టేడియంలలో ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్నాయని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) కార్యదర్శి సానా సతీష్ బాబు తెలిపారు. ఈ మ్యాచ్‌లు డిసెంబర్ 5వ తేదీ వరకు జరుగుతాయని వెల్లడించారు. మ్యాచ్ నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో అస్సాం, రైల్వేస్, చండీగఢ్, పాండిచ్చేరి, విదర్భ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ జట్లు పాల్గొంటాయని తెలిపారు. ఇండియా ఐపిఎల్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆటగాళ్లు ఇందులో పాల్గొంటారని తెలిపారు.

మారని మత్స్యకారుల బతుకులు

- వేటకు వెళ్తేగాని పూట గడవని పరిస్థితి
- కెమికల్ కంపెనీల వ్యర్థాలతో దొరకని మత్స్య సంపద
- నిర్మాణానికి నోచుకోని ఫిష్ ల్యాండింగ్ కేంద్రం
- నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం



ప్రజాశక్తి-భోగాపురం

ప్రభుత్వాలు మారుతున్నా మత్స్యకారుల జీవనం దినదిన గండంగానే ఉంది. ఏళ్ళ తరబడి ఎదుగుబొదుగూ లేక వారి బతుకులు ఇంకా అట్టడుగునే ఉన్నాయి. వీరిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకునే పరిస్థితి లేదు. నాటు పడవలపై వేటకు వెళ్లినా సరైన మార్కెటింగ్ సదుపాయంలేక దళారులు దోచుకుంటున్నారు. జెట్టీ లేక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లే పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వ హయాంలో చింతపల్లిలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మిస్తామని చెప్పి కేవలం శంకుస్థాపనకే పరిమితం చేశారు. దీంతో పడవలు ఒడ్డుకు చేరే సమయంలో అలల తాకిడికి మత్స్యకారులు ప్రాణాలు కోల్పోతున్నారు. చివరకు ఎమ్మెల్యే లోకం మాధవి మత్స్యకారుల సమస్యలను అసెంబ్లీలో తాజాగా ప్రస్తావించారు. ఇప్పటికైనా వీరి కష్టాలు తీరుతాయో లేదో చూడాలి. నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా జిల్లాలోని మత్స్యకారులపై ప్రత్యేక కథనం.

జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 16 మత్స్యకార గ్రామాలు ఉండగా సుమారు 20వేల మంది మత్స్యకారులు ఉన్నారు. ఇందులో సుమారు 5వేల కుటుంబాలు వేటే ఆధారంగా జీవనం సాగిస్తున్నాయి. సాంప్రదాయ పడవలు 419 ఉండగా, మెకనైజ్డ్ బోట్లు 722 ఉన్నాయి. కాని ఇప్పటికీ వేటకు వెళ్తే గాని ఇళ్ళ గడవని పరిస్థితి ఉంది. ఒకవేళ వేటకు వెళ్ళినా ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. తుపానులు వస్తే వేటను నాలుగైదు రోజులు నిషేధిస్తున్నారు. ఆ సమయంలో కూడా వారికి కేజీ బియ్యం కూడా ప్రభుత్వాలు అందించే పరిస్థితి లేదు. అలాగే వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందించే భృతి కూడా ఈ ఏడాది నేటికి ఇవ్వకపోవడం విచారకరం.

కెమికల్ పరిశ్రమల కాలుష్యంతో దొరకని మత్స్య సంపద

జిల్లాలోని అటు పూసపాటిరేగ ఇటు భోగాపురం సరిహద్దుల్లో కెమికల్ పరిశ్రమలు విస్తరించి ఉన్నాయి. పూసపాటిరేగ మండలం సరిహద్దులో ఉన్న పైడిభీమవరంలో అనేక కెమికల్ కంపెనీలు ఉన్నాయి. భోగాపురం సరిహద్దు అన్నవరం సమీపంలో భారీ కెమికల్ పరిశ్రమ ఉంది. వీటి నుంచి వచ్చే వ్యర్థాలను నేరుగా సముద్రంలోకి వదులుతున్నారు. దీనితో మత్స్యసంపద దొరకడం కష్టమవుతోంది. దీంతో ఈ ప్రాంతంలో ఉపాధి దొరకక మత్స్యకారులంతా ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ముఖ్యంగా గుజరాత్‌లోని హీరావళి, కర్ణాటకలో మంగుళూరు, ఒరిస్సాలోని పారాదీప్, విశాఖపట్నం, కాకినాడ వంటి ప్రాంతాలకు జీవనోపాధికోసం వలసలు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ మత్స్యసంపద దొరికినా సరే వాటిని నిల్వ చేసేందుకు శీతల గిడ్డంగులు లేకపోవడంతో దళారులకు ఎంతోకొంతకు అమ్మేయాల్సిన పరిస్థితి ఉంది.

కలగానే మిగిలిన జెట్టీ నిర్మాణం

జిల్లాలోని మత్స్యకారులు వలసలు పోకుండా ఉండేందుకు ఇక్కడే జెట్టీ నిర్మించాలని చాలా రోజులు నుంచి పోరాడుతున్నారు. కాని గత ప్రభుత్వం హయాంలో చింతపల్లిలో ఫిష్‌ల్యాండింగ్ కేంద్రాన్ని నిర్మించాలని నిర్ణయించారు. చివరకు అప్పటి ముఖ్యమంత్రి విమానాశ్రయం శంకుస్థాపనకు వచ్చినప్పుడు దీనికి కూడా అక్కడే శంకుస్థాపన చేశారు. రూ.23.55 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు కూడా ప్రకటించారు. కాని నేటికీ చింతపల్లి వద్ద పనులు ప్రారంభం కాలేదు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వమైన తమ సమస్యలు పట్టించుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి
- దురలవాట్లకు దూరంగా ఉండాలి : జెసి మాధవన్



బహుమతులు అందుకున్న చిన్నారులతో కేసలి అప్పారావు, జెసి సేతుమాధవన్

ప్రజాశక్తి-విజయనగరంకోట

బాలలకు బాలల హక్కులు, విద్యాహక్కు చట్టం, బాల కార్మిక వ్యవస్థ చట్టాలపై పూర్తి అవగహన కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు విద్యా, స్త్రీ శిశు సంక్షేమ అధికారులను కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో బాలల దినోత్సవం, బాలల హక్కుల వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలలు అందరికీ చదువు, ఆరోగ్యంతో పాటు భద్రత ముఖ్యమన్నారు. బాలలతో పనిచేయించడం, బాలల అక్రమ రవాణా నేరమన్నారు. బాలికలు లైఫ్ స్కిల్స్ తో పాటు స్వయం రక్షణకు కావలసిన జాగ్రత్తలు తెలుసుకోవాలని కోరారు

దురలవాట్లకు దూరంగా ఉండాలి : జె.సి. సేతు మాధవన్

జాయింటు కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ మాట్లాడుతూ బాలలు దురలవాట్లు, చెడు స్నేహాలు, సోషల్ మీడియాకు దూరంగా ఉండేలా ఉపాధ్యాయులు బోధించాలని అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుండే నైతిక విలువలు నేర్చుకోవాలని, బాల్య దశ నుండే బాలల చట్టాలపై పూర్తి అవగహన కల్గి వుండాలని అన్నారు. బాలల హక్కులపై అనర్గళంగా మాట్లాడిన కెజిబివి స్కూల్ విద్యార్థిని రేజేటి పావనికి రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు డా.హిమబిందు తనకు వచ్చిన బంగారు పతకాన్ని బాలికకు బహుకరించి, అభినందించారు.

బాలల హక్కుల వారోత్సవాలు సందర్భంగా కెజిబివి పాఠశాలల విద్యార్థినులకు బాలల హక్కులపైనా, పోస్టరు మేకింగు, గేమ్స్ ఇవెంట్స్‌లోను గెలుపొందిన విజేతలను, జాతీయ స్థాయి పోటోల్లో పాల్గొన్న 11జెడ్‌పి పాఠశాలల విద్యార్థినులను సత్కరించి బహుమతులు అందజేశారు. సమావేశంలో జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతకుమారి, డిప్యూటీ డిఇఒ బి.గౌరీశంకర్, ఐసిడిఎస్, విద్యాశాఖ అధికారులు, బాల కార్మిక వ్యవస్థ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒపిఎస్ అమలుకు 10న చలో విజయవాడ

ప్రజాశకి-విజయనగరం టౌన్

పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ డిసెంబర్ 10న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎ పి సిపిఎస్ఇ యూనియన్ రాష్ట్ర మీడియా ఇంచార్జి గంట శ్రీనివాసరావు, గంట్యాడ మండల అధ్యక్షులు కె .సతీష్ పిలుపునిచ్చారు. బుధవారం గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సిపిఎస్ ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారని, కానీ నాలుగు నెలలైనా సిపిఎస్ ఉద్యోగులతో చర్చలకు ముందుకు రాకపోవటం నిరాశకు గురి చేస్తుందని అన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సిపిఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లాలో ప్రతీ ఉద్యోగి హాజరైన ప్రభుత్వానికి మన ఆవేదన తెలియజేయాలని కోరారు.



ఎపిజిఎల్ఐ సంచాలకులు శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సిబ్బంది

ఉద్యోగులతో స్నేహపూర్వకంగా మెలగండి

రుణాలు, క్లయిమ్‌ల పరిష్కారానికి చొరవ చూపండి

ఎపిజిఎల్ఐ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సహ ఉద్యోగుల పట్ల, ఇతర శాఖల అధికారులు ఉద్యోగుల పట్ల ఎపిజిఎల్ఐ అధికారులు సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని ఎపిజిఎల్ఐ రాష్ట్ర సంచాలకులు రెడ్డి శ్రీనివాస్ సూచించారు. బుధవారం స్థానిక ఎపి జిఎల్ఐ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరుకు సంబంధించి ఎఫ్ఆర్ ఎస్, హాజరు పట్టి, ఇతర రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ, ఇతర శాఖల అధికారులు, సిబ్బందికి ఏపిజిఎల్ఐ అందిస్తున్న సేవలు పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. రుణాల క్లైముల పరిష్కారంలో చొరవ చూపాలన్నారు. పాలసీలకు సంబంధించి ఎవరికైనా అనుమానాలుంటే నివృత్తి చేయాలని ఆదేశించారు. అనంతరం శ్రీకాకుళం జిల్లా ఎపిజెఎల్ఐ కార్యాలయం తనిఖీకి బయలుదేరి వెళ్లారు. ముందుగా విజయనగరం చేరుకున్న ఆయన స్థానిక పైడితల్లి అమ్మవారి దేవాలయం సందర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కేంద్రం సహాయ సంచాలకులు ఎఆర్‌కె నాయుడు, విజయనగరం సహాయ సంచాలకులు జి.హైమావతి, పర్యవేక్షకులు కరుణ, సుధారాణి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసుల్లో మూలాలను ఛేదిస్తున్నాం

ఎస్‌పి వకుల్ జిందాల్



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-రాజాం

గంజాయి కేసుల్లో ప్రధాన మూలాలను ఛేధిస్తున్నామని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం రాజాం పోలీసు స్టేషను సందర్శించి, స్టేషను పరిసరాలు, లాకప్ సెల్స్, ప్రాపర్టీ రూం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషను ప్రాంగణంలో సీజ్ చేసి ఉన్న ద్విచక్ర మరియు ఇతర వాహనాలను పరిశీలించి, ఏ నేరంలో ఏ తరహా వాహనాలను సీజ్ చేసినది, అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీసు సిబ్బందితో మాట్లాడి వారికి దత్తతగా అప్పగించిన గ్రామాలను వారంలో ఒకసారి విధిగా సందర్శించాలని, గ్రామంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, భూతగదాలు, గొడవలు, వివిధ రాజకీయ పార్టీల వైరం, పాత నేరస్తులు, హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తుల, గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగం గురించి సమాచారం సేకరించి, ఉన్నతాధికారులకు అందజేయాలని తెలిపారు. గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టాలని, మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలను ప్రజలు, విద్యార్థులకు 'సంకల్పం' కార్యక్రమంతో అవగాహన కల్పించాలని ఆదేశించారు. గంజాయి కేసుల్లో ప్రధాన సూత్రధారులను అరెస్టు చేసి, మూలాలను సమూలంగా గుర్తించి, చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సిడి ఫైళ్లను పరిశీలించి కేసుల దర్యాప్తు పూర్తి చేసేందుకు అధికారులకు దిశా నిర్దేశం చేసారు. దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలను, మహిళల భద్రతకు, గంజాయి రవాణా నియంత్రణకు పోలీసులు చేపడుతున్న చర్యలను రాజాం సిఐ అశోక్ కుమార్ ఎస్‌పికి వివరించారు. అనంతరం, చెవిటి, మూగ పిల్లలకు నూతన వస్త్రాలను ఎస్‌పి అందజేశారు. రాజాం పట్టణంలో పోలీసు క్వార్టర్స్ పడగొట్టిన ఖాళీ స్థలాన్ని ఎస్‌పి పరిశీలించి, ఖాళీ స్థలాన్ని పోలీసుశాఖ తిరిగి వినియోగించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

క్షేత్ర స్థాయిలో బాధితులకు భరోసా కల్పించాలి

మహిళా సంరక్షణ పోలీసులు, దత్తత గ్రామాల పోలీసు సిబ్బందితో మమేకమై, క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన విధులపై ఎస్‌పి దిశా నిర్దేశం చేసారు. మహిళా సంరక్షణ పోలీసులు, దత్తత గ్రామాల పోలీసు సిబ్బంది పాత్ర క్షేత్ర స్థాయిలో క్రియాశీలకం అన్నారు. గ్రామ స్థాయిలో జరుగుతున్న నేరాలు, శాంతిభద్రతల సమస్యలు, బెల్టు షాపులు, గంజాయి వినియోగదారులు, విక్రయదారుల సమాచారాన్ని సేకరించి, సంబంధిత పోలీసు అధికారికి అందించాలన్నారు. ఎవరైనా సైబరు మోసానికి గురైతే 1930కు లేదా సైబర్ క్రైమ్ పోర్టల్ ఫిర్యాదు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు, సిఐ కె.అశోక్ కుమార్, ఎస్‌బి సిఐ ఎవి లీలారావు, రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్రరావు, ఎస్ఐ రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండగ పనులన్నీ 15లోగా పూర్తి కావాలి

గతి తప్పుతున్న ఎంపిడిఒలపై కలెక్టర్ ఆగ్రహం



ప్రజాశక్తి-విజయగరంకోట

పల్లె పండగ కార్యక్రమం కింద మంజూరైన పనులన్నింటినీ డిసెంబర్ 15 లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ఈ కార్యక్రమం కింద చేపడుతున్న సిసి రోడ్లు, కాటిల్ షెడ్స్ తదితర పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల వారీగా బుధవారం సమీక్షించారు. పంచాయతీ రాజ్ ద్వారా 2203 పనులు మంజూరు కాగా 1407 పనులు గ్రౌండ్ అయ్యాయని, 61 పనులు పూర్తయ్యాయని, 6 పనులకు మాత్రమే బిల్లులను సమర్పించారని తెలిపారు. పనులు వేగంగా జరగాలని, పూర్తి చేసిన బిల్లులను వెంటనే సబ్మిట్ చేయాలని ఆదేశించారు. తక్కువ ప్రోగ్రెస్ ఉన్న ఎంపిడిఒలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుర్ల తప్ప మిగిలిన మండలాలన్నీ వెనకబడి ఉన్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంతవరకూ మొదలు పెట్టని పనులను ప్రస్తుత వెండర్‌ను రద్దు చేసి కొత్త వెండర్‌తో పనులు మొదలు పెట్టాలని సూచించారు. కాటిల్ షేడ్స్ జిల్లాలో 858 మంజూరు కాగా 386 గ్రౌండింగ్స్ అయ్యాయని, వీటిని త్వరగా పూర్తి చేసి బిల్లులను సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణ, డ్వామా పీడీ కల్యాణ చక్రవర్తి, పంచాయతీ రాజ్ ఎస్ఇ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రభుత్వ సంస్కృత ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అదనపు సీనియర్ సివిల్ జడ్జి టివి రాజేష్ కుమార్ హాజరయ్యారు. 14ఏళ్ల లోపు బాలలంతా విధిగా స్కూల్లో ఉండాలని తెలిపారు. బాలల హక్కులు, బాధ్యతలు, నైతిక విలువలు గురించి తెలియజేశారు, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని తెలిపారు. బాల్య దశ నుంచే చట్టాల పట్ల అవగాహన ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ పిబిరాజు, హెచ్ఎం టి.లలితకుమారి పాల్గొన్నారు.

350 కేజీల ప్లాస్టిక్ సంచులు సీజ్

ప్రజాశక్తిగీవిజయనగరం టౌన్

విజయనగర పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై దాడులు నిర్వహించిన ప్రజారోగ్య బృందం 350 కేజీల ప్లాస్టిక్ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి బృందం పిడబ్ల్యు మార్కెట్లో బుధవారం వివిధ ప్లాస్టిక్ విక్రయాల దుకాణాలపై దాడులు నిర్వహించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నగరంలో ఒకసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్లు ఎంహెచ్ఒ సాంబమూర్తి తెలిపారు. ఈ మధ్యనే 560 కేజీల ప్లాస్టిక్ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామని, మళ్లీ పిడబ్ల్యు మార్కెట్లో కొందరు నిషేధిత ప్లాస్టిక్ ను విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచార మేరకు దాడులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 74 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా ప్రభుత్వ ఐటిఐలో నిర్వహించిన జాబ్‌మేళాకు 167 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 74 మంది పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని తెలిపారు. జాబ్ మేళాలో ముఖ్య అతిథులుగా ఐటిఐ కన్వీనర్ టివి గిరి, జిల్లా ఉపాధికల్పన అధికారి డి.అరుణ, జిల్లా నైపుణ్యాధికారి ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ యాజమాన్యంపై చర్యకు అసెంబ్లీలో తీర్మానం

పాలరైతుల సంఘం హర్షం

ప్రజాశక్తి-విజయనగరం

ఆవు పాల సేకరణ ధరను విశాఖ డెయిరీ తగ్గించిన నేపథ్యంలో యాజమాన్యంపై చర్యలకు అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ పాలరైతు సంఘం జిల్లా అధ్యక్షులు లోకవరపు ఆదినారాయణ, కార్యదర్శి గొంప కృష్ణమూర్తి హర్షం వ్యక్తం చేశారు. విశాఖ డెయిరీ ఆవు పాల సేకరణ ధరను లీటరకు రూ.2.60పైసలు నుంచి రూ.4కు తగ్గించింది. ఈనేపథ్యంలో రైతులంతా గతనెల 29న విశాఖ డెయిరీ వద్ద మహాధర్నా చేశారు. జిల్లాలో సదస్సులు, రాస్తారోకోలు చేపట్టారు. డెయిరీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. తగ్గించిన పాల సేకరణను పెంచాలని కోరారు. దీనిపై అసెంబ్లీలు పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సభాసంఘాన్ని ఏర్పాటు చేయాలని స్పీకర్‌ను కోరారు. ఆయన ప్రతిపాదనమేరకు సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సభా సంఘం ఏర్పాటు చేసిన స్పీకర్‌కు, ప్రతిపాదించిన సభ్యులకు పాలరైతు సంఘం నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

పన్నులు చెల్లించండి



షాపును తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పాటు అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. బుధవారం మొండిబకాయలను వసూలు చేసేందుకు సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు నేతృత్వంలో సిబ్బంది విస్తృతంగా పర్యటించారు. కెఎల్ పురం, బాలాజీ మార్కెట్ ప్రాంతాల్లో మొండి పన్ను బకాయిలు ఉన్న దుకాణాలకు వెళ్లి పన్నులు రాబట్టేందుకు ప్రయత్నించారు. పన్నులు కట్టేందుకు దుకాణదారులు సమ్మతించడంతో ఇంటి పన్ను, కుళాయి పన్ను, పాత్ర కొత్త ఐడిఎస్ఎంటి షాపింగ్ కాంప్లెక్స్ అద్దెబకాయిలు వసూళ్లకు ఉపక్రమించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మొండిబకాయలను ఎట్టి పరిస్థితులలోనూ ఉపేక్షించ బోమని స్పష్టం చేశారు.

అనధికార నిర్మాణాలపై కొరడా

అనధికార కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఆయన ఆదేశాలతో ప్రణాళిక విభాగం అధికారులు సిబ్బంది పలు ప్రాంతాలలో పర్యటించి అనధికార నిర్మాణాలను, ఆక్రమిత షెడ్డులను తొలగించారు. కోలగట్ల వారి వీధిలో గహ అవసర నిర్మాణానికి అనుమతి తీసుకొని తదనంతరం వ్యాపార సముదాయంగా మార్చడాన్ని ప్రణాళిక సిబ్బంది గుర్తించారు. సదరు భవనం డివియేషన్‌కు గురైనట్లు గమనించి రెండుసార్లు ప్రణాళిక విభాగం సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. యజమానికి నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో భవనానికి నిర్మించిన గోడలను తొలగించారు. రామారాయుడు రహదారిలో వేసిన తాత్కాలిక ఆక్రమణలు తొలగించారు. ఎక్కడైనా అనుమతులు నిరాకరించి నిర్మాణాలు జరిపినా, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినా తొలగిస్తామని కమిషనర్ తెలిపారు.

యాదవ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్‌గా లక్ష్మీవరప్రసాద్

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా టిడిపి నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్ నియమితులయ్యారు. ఈమేరకు టిడిపి కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈసందర్భంగా ఆయన బుధవారం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజును మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీవరప్రసాద్‌ను పలువురు అభినందించారు.



అశోక్‌గజపతిరాజును కలిసి ధన్యవాదాలు తెలుపుతున్న లక్ష్మీ వరప్రసాద్

కాంగ్రెస్‌లో చైతన్యకుమార్ చేరిక

ప్రజాశక్తి-విజయనగరం కోట

గత అసెంబ్లీ ఎన్నికల్లో జై భారత్ పార్టీ తరపున రాజాం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన కుప్పిలి చైతన్యకుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు పార్టీ కండువా వేసి విద్యాసాగర్ ఆహ్వానించారు. ఆయనతో పాటు డాక్టర్ కంచరాపు తిరుపతిరావు, బలివాడ మన్మథరావు మరి కొంతమంది కార్యకర్తలు పార్టీలో చేశారు. కార్యక్రమంలో గంటా సతీష్, రాయల సురేష్, ఎస్. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.



వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో బహుమతులు గెలుచుకున్న చిన్నారులు

పుస్తక పఠనం తప్పనిసరి

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

విద్యార్థులుతప్పనిసరిగా పుస్తక పఠనం చేయాలని విజయనగరం మండల విద్యాశాఖాధికారి డివిబి సుబ్బరాజు అన్నారు. బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఇఒ సుబ్బరాజు బాలలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పుస్తకాలు చదవడం అలమర్చుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులంతా సెలవు రోజులలో మీకు దగ్గరలో గల గ్రంథాలయాలను సందర్శించి వారు ఏర్పాటు చేసే కార్యక్రమాలలో పాల్గొనాలని సూచించారు, జిల్లా వయోజన విద్యా శాఖ అసిస్టెంటు ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులంతా సెల్ ఫోన్‌కు దూరంగా ఉంటూ పుస్తక పఠనం చేయాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి, మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠకులు గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రతి ఏటా ఇచ్చే జయంతి రామలక్ష్మణ మూర్తి పురస్కారం ఈ ఏడాది దేవుపల్లి శాఖా గ్రంథాలయంలో పనిచేస్తున్న గ్రంథాలయాధికారి కెఎస్ఎన్ పట్నాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ.గోపాలరావు, గ్రంథాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు .

గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలు

గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలని పలువురు వక్తలు అన్నారు. గాజుల రేగ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు జరిగింది. ఈ వారం రోజులు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రతిమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ నారాయణరావు, బి.రామానాయుడు, ఉపాధ్యాయులు గౌతమ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఎం లక్ష్మణరావు మాట్లాడుతూ వారోత్సవాల సమయాల్లోనే కాకుండా వీలున్నప్పుడల్లా గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయాలని కోరారు.

కొండవెలగాడ పిహెచ్‌సిలో మొదటి ప్రసవం

ప్రజాశక్తి-నెల్లిమర్ల



తల్లీ బిడ్డలను పరామర్శిస్తున్న సర్పంచ్, వైద్యులు

కొండ వెలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొదటి సాధారణ ప్రసవం జరిగినట్లు వైద్యాధికారి డాక్టర్ ధనుంజయ్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చినబూరాడ పేటగ్రామానికి చెందిన మజ్జి సత్యవతి సాధారణ ప్రసవం విజయవంతం గా నిర్వహించి నట్లు తెలిపారు. జెడిపిటిసి సభ్యులు గదల సన్యాసినాయుడు, సర్పంచ్ గదల బంగారమ్మ ఆసుపత్రిని సందర్శించి తల్లి బిడ్డలను పరామర్శించారు. మొదటి ప్రసవం విజయవంతంగా చేసినందుకు సిబ్బందిని, వైద్యులను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, పిహెచ్ఎన్ రూతమ్మ, స్టాఫ్ నర్స్ సరస్వతి, ఎఎన్ఎం ఉమా మహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను వినియోగించుకోవాలి

జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పోస్టల్ సేవలను, ప్రయోజనాలను, ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసు అన్నారు. సబ్‌డివిజన్ పరిధిలో పోస్టల్ శాఖ నిర్వహిస్తున్న నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డైరెక్ట్ బెనిఫిషియర్ ట్రాన్స్‌ఫర్ మ్యాపింగ్ ప్రత్యేక క్యాంపులను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రతి గ్రామంలో ప్రజల సౌకర్యార్థం మ్యాపింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నామని దీనివల్ల ప్రభుత్వ పథకాల లావాదేవీలు తపాలా ద్వారా ప్రజలకు అందుబాటులోకి వస్తాయని అన్నారు. అనంతరం చప్ప మౌనికకు తపాలా జీవిత బీమా డెత్ క్లెయిమ్ బెనిఫిట్ రూ.12 లక్షలను అందజేశారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకుల బృందం

క్యాంపస్ ఇంటర్వ్యూలో 11మందికి ఉద్యోగాలు

బొబ్బిలి: క్వెస్ట్ స్పైడర్ కంపెనీ యాజమాన్యం ఆన్‌లైన్‌లో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో రాజా కళాశాలకు చెందిన 11మంది విద్యార్థులు ఉద్యోగాలను సాధించినట్లు ప్రిన్సిపాల్ సిహెచ్ వీరేంద్రకుమార్ తెలిపారు. ఈనెల 6,17న డిగ్రీ, ఎంసిఎ విద్యార్థులకు ఆన్‌లైన్ క్యాంపస్ ఇంటర్వ్యూ జరగ్గా తొమ్మిది మంది డిగ్రీ విద్యార్థులు, ఇద్దరు ఎంసిఎ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. డిగ్రీ విద్యార్థుల్లో బి భార్గవరాముడు, ఎమ్. అను, వై జ్యోతిర్మయి, వి.జి. గణేష్, కె హేమంత్ కుమార్, టి. లవకుమార్, ఎన్. సూర్యతేజ, సిహెచ్ వెంకటేశ్వర్, ఎస్. మౌళి సాత్విక్, ఎంసిఎ విద్యార్థులు కె. హారిప్రియ, సాగి అనూష ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. వీరందరికీ ఉద్యోగ నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు ప్లేస్మెంట్ అధికారి శరత్ కుమార్ చెప్పారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ ఆర్‌విఎస్‌కె రంగారావు, సెక్రటరీ బదరీ అభినందించారు.

పనివేళల పెంపు సరికాదు : ఎపిటిఎఫ్

రామభద్రపురం: ప్రభుత్వ పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయం సరైనది కాదని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మడక బలరాం నాయుడు అన్నారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవలే ప్రభుత్వం ఇలా పని వేళలు పెంచడం ద్వారా దూర ప్రాంత విద్యార్థులు అనేక ఇబ్బందులు పడతారని ముఖ్యంగా బాలికలకు భద్రత, రక్షణ కరువవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 9.45 గంటల నుంచి 4.40 గంటల వరకు ఉండే విధానాన్నే కొనసాగించేలా చూడాలని పలువురు కూడా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎంటిఎస్ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సు కూడా 62 సంవత్సరాలు చేయాలని వారికి కూడా క్యాజువల్ లీవ్స్ మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ శాఖ జిల్లా కార్యదర్శి సత్యారావు, మండల ఉపాధ్యక్షులు మునసయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం వద్ద బోరు ఏర్పాటు

తెర్లాం: మండలంలోని పెరుమాలి అంగన్వాడీ కేంద్రంలో తాగునీటి కోసం గత మూడు సంవత్సరాలుగా పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. వేరే వీధుల్లోకి వెళ్లి నీళ్లు మోసుకు వచ్చేవారు. ఈ సమస్యను అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఆ గ్రామ సర్పంచ్ హేమలత సమస్యను గుర్తించి బుధవారం పంచాయతీ నిధులతో హ్యాండ్ బోరును వేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి వెంకటరావు, అప్పలరాజు, అప్పల నరసింహరాజు పాల్గొన్నారు.

పన్నుల విధింపు ప్రక్రియ పరిశీలన

నెల్లిమర్ల: నగర పంచాయతీలో భవనాల పన్ను విధింపుపై బుధవారం కమిషనర్ కె. అప్పలరాజు 3వ సచివాలయం పరిధిలో తనిఖీలు చేపట్టారు. మార్పులు చేసిన భవనాలకు అదే పన్నులు విధించినది, లేనిది డి.ఇ. (ట్రేడ్ లైసెన్సులు వసూలు చేస్తున్నారా లేదా సంబంధిత సచివాలయ సెక్రటరీలతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆర్‌ఐ ఉమా భాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

గజపతినగరం: మండలంలోని మధుపాడ ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచారు. ఈ పాఠశాలలో చదువుతున్న జె.శ్యామ్, ఎస్. కృష్ణ అండర్ 19 కబడ్డీ బాలుర విభాగంలో రాష్ట్రస్థాయిలో తమ ప్రతిభను చూపించారు. అథ్లెటిక్స్‌లో 400 విభాగంలో ఆర్. వెంకటశ్రీనిధి తృతీయ స్థానంలో నిలిచారు. సిహెచ్. భానుప్రసాద్, కె.రామచరణ్, టి. వరుణ్ సందేశ్, అండర్ 17 ట్రెక్కింగ్ ఆటలో రాష్ట్రస్థాయిలో పాల్గొని తమ ప్రతిభను చూపించారు. విద్యార్థులకు చక్కని తర్ఫీదు ఇచ్చిన పీడీ రాధని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.ఆర్.కె రావు అభినందనలు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - విజయనగరం కోట

విజయనగరం పరిధిలో 7 ఏళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడిపై మహిళా పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశారు. చిన్నారిని రోజూ రిక్షాలో పాఠశాలకు తీసుకెళ్లే నారంశెట్టి ఈశ్వరరావు ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్‌టిసి, ఆస్పత్రి బస్సులు ఢీ

పలువురికి గాయాలు

ప్రజాశక్తి - డెంకాడ

మండల పరిధిలోని విజయనగరం విశాఖపట్నం జాతీయ రహదారి మోదవలస వద్ద ఆర్‌టిసి బస్సు, ఆస్పత్రి బస్సు ఢీ కొనడంతో పలువురుకు గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. తగరపువలస అనిల్ నీరుకొండ హాస్పిటల్‌కి చెందిన బస్సు విజయనగరం నుంచి విశాఖపట్నం వైపు వెళుతుండగా అదే రహదారిలో వెళ్తున్న ఆర్‌టిసి బస్సు వెనుక నుంచి మోదవలస వద్ద బలంగా ఢీకొంది. దీంతో హాస్పిటల్ బస్సులో ప్రయాణిస్తున్న విజయనగరం విటి అగ్రహారంలోని సంతోష్ నగర్‌కు చెందిన జమ్ము అప్పలరాజుకు బలమైన గాయాలయ్యాయి. ఇతనతో పాటు అదే బస్సులో ప్రయాణిస్తున్న మరి కొంతమందికి గాయాలయ్యాయి. వీరందరినీ తగరపువలస అనిల్‌నీరు కొండ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆర్‌టిసిలో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. బస్సు ముందు భాగం హాస్పటల్ బస్సు వెనుక భాగం నుజ్జు నుజ్జయింది. తీవ్రంగా గాయాలైన అప్పలరాజు ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

5 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని రామలింగాపురంలో 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని సిమ్మ దేవుడమ్మను అరెస్ట్ చేశామని ఎస్‌ఈబి ఎస్‌ఐ సింహాద్రి, ఎస్‌ఐ రాజాశ్రీ తెలిపారు. ఈ కేసును కొత్తవలస పోలీస్ స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేశామని చెప్పారు. ఈ రైడింగ్‌లో హెచ్‌సి నాగేశ్వరరావు, కానిస్టేబుల్ బిఎన్ ప్రసాద్, వి యమ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

ప్రజాశక్తి - గజపతినగరం

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు బుధవారం స్థానిక లక్ష్మీనారాయణ కళ్యాణ మండపంలో అధ్యక్షులు సిహెచ్.భాస్కరరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సభకు ముఖ్య అతిథులుగా పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయ గౌరీ, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు హాజరై పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ ఎప్పుడూ పోరాటం చేస్తుందన్నారు. పాఠశాల విద్యా వ్యవస్థను నాశనం చేసే జీవో నెంబర్ 117ను రద్దు చేసి ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేయాలని, సిపిఎస్ జిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని, పెండింగ్ బకాయిలను చెల్లించి, 12వ పిఆర్సీ అమలు అయ్యేలా తక్షణమే ఐఆర్ ప్రకటించాలని కోరారు. అనవసరమైన యాప్‌ల పని భారం తగ్గిస్తూ, నాణ్యమైన విద్యకు ఆటంకం కలిగించే బోధనేతర పనులను ఉపాధ్యాయులకు అప్పగించరాదన్నారు. అర్హత గల వారికి నెలవారి ప్రమోషన్లు ఇవ్వాలని, శాశ్వత బదిలీ కోడ్ తీసుకువచ్చి అందరికీ న్యాయం జరిగే బదిలీలు చేపట్టాలని, తక్షణమే మెగా డిఎస్‌సి ప్రకటించాలని కోరారు. విద్యార్థుల మానసిక స్థితిపై ప్రభావం చూపే పాఠశాలల పనివేళలా పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. అనంతరం యుటిఎఫ్ నాయకత్వం నుంచి రిటైర్ అయిన ఉపాధ్యాయులను సన్మానించారు. నియోజకవర్గస్థాయి ఆటల పోటీలలో గెలుపొందిన ఉపాధ్యాయులకు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వి.రాధాభవాని బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జేఆర్సి పట్నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి జే.ఏ.వి.ఆర్.కె ఈశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ డి.రాము, ఐక్య ఉపాధ్యాయ పత్రిక సబ్ ఎడిటర్ కె.శ్రీనివాసరావు, పలువురు యుటిఎఫ్ నాయకులు, నాలుగు మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు,యుటిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.



గజపతినగరం: సభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మోహనరావు

పాఠశాలల పనివేళల పెంపు వెనక్కి తీసుకోవాలి

వంగర: ఉన్నత పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాలని ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్ రావు డిమాండ్ చేశారు. మండలంలోని అరసాడ ప్రాథమిక పాఠశాలలో జరిగిన మండల యూటిఫ్ స్వర్ణోత్సవ సభలకు ముఖ్య అదితిగా హాజరై ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పాఠశాలలకు సుమారు 6 కిలోమీటర్లు దూరం నుంచి నడిచి లేదా సైకిల్స్ పై వస్తున్నారని సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలో ఉంచడం వల్ల వారు ఇంటికి వెళ్లేసరికి చీకటి పడుతుందని, వారికి సరైన భద్రత ఉండదని చెప్పారు. అనంతరం మండల యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఎన్నికల పరిశీలకులుగా డివిజన్ కార్యదర్శి గేదల. రమేష్ వ్యవహరి ంచారు నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా సీర అప్పలనాయుడు, అధ్యక్షులుగా మర్రాపు ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పెంకి గౌరిశంకరరావు, ఉపాధ్యక్షులుగా బలగ ప్రసాద్, మహిళా ఉపాధ్యక్షులుగా పక్కి జ్యోతి, కోశాధికారిగా బోనుమద్దెల శ్రీనివాసరావు, ఆడిట్ కమిటీ ఆర్ అప్పలనాయుడు, బి రమేష్ సీపీఎస్ కమిటీ పి శ్రీరామమూర్తి, బి దుర్గారావులు, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా డి వెంకటరమణ, టి దుర్గారావు, టి రమణయ్య, భాస్కర్ రావు, బి సింహాచలం, యస్ లక్ష్మణరావు, పి మురళితో పాటు మరి కొంతమంది మండల కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

22ఎ భూములను సరిచేసి హక్కు కల్పించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

22ఎలో ఉన్న జిరాయితీ భూములలో తమకు హక్కు కల్పించాలని మధుపాడ గ్రామస్థులు కోరారు. బుధవారం మధుపాడలో 22ఎలో ఉన్న భూములను ఆర్‌డిఒ దాట్ల కీర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా మధుపాడ గ్రామస్థులు, సర్పంచ్ నల్లం అప్పారావు ఆధ్వర్యంలో నల్లం శ్రీనివాసరావు, నల్లం సత్యం, తోట గోవిందరావు, మల్లి పాముల సుదర్శన రావు, ఎం.వెంకట రావు, ఆనందరావు తదితరులు మాట్లాడుతూ మధుపాడ గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 1లో 8.13 ఎకరాల భూమిలో 1.30 ఎకరాల భూమి బిసి కాలనీకి పోగా మిగతా భూమి సర్వే రికార్డులతో తమ పేరిట నమోదు జరిగి తాము గత కొన్ని సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నామని తెలిపారు. అయితే తాము సాగు చేసుకుంటున్న ఈ భూమిని రెవెన్యూ రికార్డుల్లో 22ఎ భూములుగా పెట్టడం క్రయ విక్రయాలు జరుపుకోలేక నానా అవస్థలు పడుతున్నామని ఆర్‌డిఒ దృష్టికి తీసుకొచ్చారు. 22ఎలో ఉన్న తమ భూములు సరి చేసి తమకు అప్పగించాలని గత 5 సంవత్సరాలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతిలేక సిఎం గ్రీవెన్స్‌లో విన్నవించుకున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా ఆ భూములపై తమకు హక్కు కల్పించాలని కోరారు. ఈ భూములన సమగ్రంగా పరిశీలించి సరిగ్గా ఉన్న భూములను రైతులకు అప్పగించాలని ఆర్‌డిఒ తహశీల్దార్‌కు ఆదేశించినట్లు రైతులు చెబుతున్నారు.



భూ వివరాలు సర్వేయర్‌ను అడిగి తెలుసుకుంటున్న ఆర్‌డిఒ కీర్తి

మురుగు శుద్ధి నీటి ప్లాంట్ స్థల పరిశీలన

నగర పంచాయతీలోని విశ్వంబర పాఠశాల వెనుక మురుగు శుద్ధి నీటి ప్లాంట్ ఏర్పాటుకు ఆర్‌డిఒ దాట్ల కీర్తి బుధవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ప్లాంట్ ఏర్పాటుకి కావాల్సిన స్థలం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి. సుదర్శనరావు, కమిషనర్ కె.అప్పలరాజు, మండల సర్వేయర్, రెవెన్యూ, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గిడ్డంగులను పరిశీలించిన జిసిసి చైర్మన్

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని జిసిసి రోడ్డులో ఉన్న గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ గిడ్డంగులను జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ బుధవారం పరిశీలించారు. బాధ్యతలు చేపట్టి తొలిసారి పట్టణానికి వచ్చిన ఆయనకు కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో తమకు జిసిసి చైర్మన్‌గా అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. సిఎం ఆదేశాల మేరకు జిసిసి గిడ్డంగులను మొత్తంగా శిథిలావస్థలో ఉన్న వాటిని పర్యవేక్షిస్తామన్నారు. అవసరమైన చోట గిడ్డంగులు మరమ్మత్తులు, నూతన గిడ్డంగులు ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గిరిజన ఉత్పత్తులు సేకరించడమే కాకుండా వాటిని బాహ్య ప్రపంచానికి తెలియజేసే విధంగా జిసిసి పనిచేస్తోందన్నారు. ఎస్‌కోట కార్పొరేషన్ భవనాలు చాలా కాలం నుంచి నిరుపయోగంగా ఉండటంతో శిథిలావస్థకు చేరుకున్నాయని గిడ్డంగులను మరమ్మతులు చేయించి వాటిని ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిసిసి డైరెక్టర్ దాసరి లక్ష్మి, టిడిపి మండలాధ్యక్షుడు జి.ఎస్ నాయుడు, నాయకులు కాపుగంటి వాసు, కిరణ్, వాకాడ బాలు, బీసెట్టి అరుణ, అనకాపల్లి చెల్లయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జిసిసి చైర్మన్ శ్రావణ్

గొల్లాది వంతెనకు నిధులు మంజూరు చేయండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి, బాడంగి మండల గ్రామాలకు ఉపయోగపడే గొల్లాది వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. అసెంబ్లీ సమావేశంలో బుధవారం గొల్లాది వంతెన, ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలపై ప్రస్తావించి ఆయా సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. గొల్లాది వద్ద వేగావతి నదిపై వంతెన నిర్మాణానికి గతంలో టిడిపి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం పనులు చేపట్టకుండా టెండర్ రద్దు చేసిందన్నారు. వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో బాడంగి, బొబ్బిలి మండలాలకు చెందిన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వంతెన నిర్మాణం చేస్తే బాడంగి, బొబ్బిలి మండలాల ప్రజలు, రైతులతో పాటు మెరకముడిదాం, గజపతినగరం మండల ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. వంతెన నిర్మాణానికి ఎన్నికల సమయంలో సిఎం చంద్రబాబు, లోకేష్ హామీలు ఇచ్చారని, నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బొబ్బిలి సిహెచ్‌సికు రోగులు తాకిడి పెరుగుతున్నప్పటికి బెడ్స్ లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆసుపత్రికి సంపన్న గర్భిణులు కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి ప్రసవం చేసుకుంటున్నారన్నారు. 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయాలని, బాడంగి ప్రభుత్వ ఆసుపత్రి భవనానికి అదనంగా నిధులు మంజూరు చేసి భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు.

నిధులు కేటాయించండి: ఎమ్మెల్యే

శృంగవరపుకోట: నియోజకవర్గంలో పిహెచ్‌సిలకు నిధులు కేటాయించాలని బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కోరారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో శిథిలావస్థలో ఉన్న పిహెచ్‌సిలకు నూతన భవనాలు నిర్మించాలని, గత ప్రభుత్వంలో ఎస్.కోట మండల కేంద్రంలో నిర్మాణంలో అసంపూర్ణంగా ఆగిపోయిన ఏరియా ఆసుపత్రిని కూడా పూర్తిచేసి రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె కోరారు.

ఆ అధికారులపై చర్యలు తీసుకోండి

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్

ప్రజాశక్తి - వేపాడ



జిల్లా కలెక్టర్‌కు తప్పుడు సమాచారం అందించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని చామలాపల్లి గ్రామం రెవెన్యూ పరిధిలో గల వెంకయ్యపాలెం గిరిజన గ్రామానికి సమీపంలోని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంస్థ భూ అభివృద్ధి పథకం పేరున 22 ఎకరాలు ఎస్‌సి ఎస్‌టిలకు గతంలో ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఈ భూమిని కొంతమంది దళారులు, దళిత సంఘాల నాయకులు మోసగించి ఇతర జిల్లా వాసులకు అమ్మేశారన్నారు. ఈ భూములను అమ్మడానికి, కొనడానికి వీలు లేదని జిఒ ఉన్నప్పటికీ తప్పుడు రిజిస్ట్రేషన్‌తో అప్పటి రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్ సహకరించారన్నారు. దీనిపై ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ ప్రభుత్వ పరమైన అనుమతులు లేకుండా లక్షలు విలువ చేసే సుమారు 50 టేకు చెట్లును రాత్రికి రాత్రి మాయం చేశారన్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ జె రాములమ్మ స్పందించి దర్యాప్తు చేసి చెట్టును అక్రమంగా నరికివేసినట్లు గుర్తించి నివేదికను జిల్లా కలెక్టర్‌కు, ఆర్‌డిఒకు, జిల్లా అటవీశాఖ అధికారులకు పంపించారన్నారు. అయినప్పటికీ అటవీ శాఖ అధికారులు ఏ విధమైన చర్యలూ తీసుకోకపోవడంతో ఈనెల 18వ తేదీన జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దృష్టికి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సామాజిక కార్యకర్త ఆర్. అప్పారావు తీసుకెళ్లారని, దీంతో అధికారులను వెంటనే దర్యాప్తు జరిపి నివేదిక ఇమ్మని ఆయన ఆదేశించారని అన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారులు డిప్యూటీ రేంజర్ డి రవికుమార్, గార్డ్ డి. సూర్యనారాయణ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఇది తమకు సంబంధం లేదని, తప్పుడు సమాచారం ఇవ్వడమే కాకుండా తాము ఎప్పుడో తహశీల్దార్‌కు రిపోర్టు తయారు చేసి ఇచ్చామని ఈ విషయంపై తహశీల్దార్, స్థానిక ఎస్ఐ చర్యలు తీసుకోవాలని తెలపడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టేకు చెట్లు మాయంకు అటవీ శాఖ అధికారులు అండదండలు పుష్కలంగా ఉన్నాయనడంలో ఏమాత్రం సందేహం లేదన్నారు. గతంలో ఇదే భూములలో ఉన్న టేకు చెట్లు నరకడానికి అనుమతులు జిల్లా అటవీశాఖ అధికారులే ఇచ్చారన్నారు. ఇప్పుడు తమకు సంబంధం లేదనడం ఎంత వరకూ సమంజసమన్నారు. అక్రమార్కులకు అటవీ శాఖ అధికారులకు సంబంధం లేకుండా టేకు చెట్లు మాయం సాధ్యం కాదని, ఈ భూముల వివాదం కోర్టులో నడుస్తుండగా టేకు చెట్లు మాయం చేయడం నేరం కాదా? అని ప్రశ్నించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్వయంగా స్పందించి పరిశీలన జరిగితే తప్ప వాస్తవాలు వెలుగులోకి రావని వెంటనే ఆయన స్పందించాలని సూర్యనారాయణ కోరారు.

నాటుసారా తయారు చేస్తే కేసులు : సిఐ

ప్రజాశక్తి- బొబ్బిలి

నాటుసారా తయారు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు అన్నారు. రామభద్రపురం మండలం చందాపురం గెడ్డ పక్కన నాటుసారా తయారు కోసం నిల్వ చేసిన 100 లీటర్ల బెల్లం ఊటను ఆయన బుధవారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. నాటుసారా, బెల్ట్‌షాపులు నివారణకు సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ వెళ్లి నైపుణ్య సర్వే చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రతి ఇంటికి వెళ్లి నైపుణ్యం యాప్ ద్వారా సర్వే చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నైపుణ్యం సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. 15 నుంచి 59 ఏళ్ల లోపు ఉన్నవారందరిని సర్వేలో నమోదు చేయాలన్నారు. సర్వేను ప్రతిష్టాత్మకంగా క్వాలిటీతో ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో టౌన్ ప్రాజెక్టు అధికారి యం.జగన్మోహనరావు, మునిసిపల్ మేనేజర్ పివిటి రాఘవాచార్యులు, మండల ఇంచార్జ్ కె.భవాని, మాస్టర్ ట్రైనర్ అశోక్, శంకరరావు, రహీంతుల్లఖాన్, సచివాలయం సెక్రెటరీ లందరూ పాల్గొన్నారు.

నెల్లిమర్ల: నైపుణ్య గణన పక్కాగా నిర్వహించాలని ఎంపిడిఒ కె. రామకృష్ణ రాజు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నైపుణ్య గణనపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15నుంచి 59సంవత్సరాలు వయస్సు కలిగిన వారిని గుర్తించి వివరాలు ఆన్ లైన్ చేయాలన్నారు. ఉద్యోగం, వ్యాపారం, వృత్తుల్లో ఉన్న వారి నైపుణ్యాన్ని రికార్డు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శంకర జగన్నాధం, మండల పరిషత్ ఎఒ పి.సుదర్శనం, సచివాలయం కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వంగర: గ్రామాలలో నిరుద్యోగ యువతను గుర్తించేందుకు సర్వే చేపడతామని ఎంపిడిఒ లోపింటి త్రినాథ రావు, ఇఒపిఆర్‌డి కెల్ల రామారావు అన్నారు. సచివాలయ ఉద్యోగులకు ప్రసాద్, వైకుంఠ రావులతో స్థానిక మండల పరిషత్‌లో బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సర్వే చేపట్టాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - జామి

ప్రభుత్వం నెల నెలా జీతాలు చెల్లించక పోవడం వల్ల ఇల్లు గడవక కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని, ప్రభుత్వం సమస్యల పరిస్కారానికి చర్యలు తీసుకొనేలా ఒత్తిడి తేవాలని 104 సిబ్బంది రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తున్న నేపథ్యంలో బుధవారం జామి జెడ్‌పిటిసి గొర్లె సరయు, ఎంపిటిసి వాక సుధాకర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకి నెల నెల సక్రమంగా జీతాలు చెల్లించక కుటుంబాలను పోషించటం కష్టంగా మారిందన్నారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా నిర్వహించాలన్నారు. సమస్యల పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్. సన్యాసినాయుడు, కృష్ణంరాజు, కోటారావు, అప్పలసూర్యానారాయణ తదితర సిబ్బంది పాల్గొన్నారు.



జెడ్‌పిటిసికి వినతినిస్తున్న 104 ఉద్యోగులు

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - రామభద్రపురం

గ్రంథాలయాలకు పాఠకుల ఆదరణ పెరగాలని ఎంఇఒ తిరుమల ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన బుధవారం హాజరై మాట్లాడారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కామేశ్వరరావు, ఉపాధ్యా యులు రఘురాం నాయుడు, లలిత, లైబ్రేరియన్ సత్యవాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వారోత్సవ ముగింపు కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుబ్బలక్ష్మి, సర్పంచ్ గనివాడ సంతోష్‌కుమారి, పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానంచ చేశారు. ఈ కార్యక్రమంలో ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు, రిటైర్డ్ తెలుగు టీచర్ కె. బాబు రావు, విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన వివిధ పోటీలలో పట్టణంలోని సర్వేపల్లి విద్యానికేతన్ పాఠశాలకు చెందిన 22 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారని పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ సన్యాసిరావు తెలిపారు. విద్యార్థులను విజేతలగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను పాఠశాల డైరెక్టర్స్ వై వెంకట్రావు, వి సుశీల అభినందించారు. గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించామని ఇంచార్జ్ హెచ్ఎం లక్ష్మణరావు తెలిపారు.

బొబ్బిలి: గ్రంథాలయ వారోత్సవాలు శాఖా గ్రంథాలయంలో ముగిశాయి. పలు ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ స్వర్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో విజేతలకు ఇఒపిఆర్‌డి ఏవి సత్యనారాయణ, రేగిడి హై స్కూల్ హెచ్‌ఎం లక్ష్మణరావు, ఉపాధ్యాయులు రామ్ కుమార్ బహుమతులు ప్రధానం చేశారు. గ్రంథాలయాధికారి పెంట ఈశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంకాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. లైబ్రేరియన్ మహేష్ ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం కృష్ణ, ఇతర ఉపాధ్యాయులు, రిటైర్డ్ లైబ్రేరియన్ డి.దేవుడు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: జరజాపుపేట గ్రామీణ గ్రంథాలయంలో విజేతలకు నిర్వహకులు జె.నారాయణమ్మ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జరజాపుపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సుంకరి వాసుదేవరావు, సత్యకాన్సెప్ట్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక గ్రంథాలయంలో ముగింపు కార్యక్రమంలో ఎంఇఒలు జి.జగదీశ్వర్ రావు, పి.బాల భాస్కర రావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంఛార్జి హెచ్ఎం కన్నయ్య పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయాధికారి ఎం.చంద్రశేఖర్, పాఠకులు పాల్గొన్నారు.

సంతకవిటి: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో హెచ్ఎం ఈశ్వరమ్మ, ఎంఆర్సి ఆఫీస్ జ్యోతి, తహశీల్దార్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ కోటి హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హై స్కూల్ డ్రాయింగ్ టీచర్, గ్రంథాలయాధికారి శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయనగరం : స్థానిక సీతం కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు జరిగాయి. సీతం కళాశాల సిబ్బంది నగరంలోని శిశుసంరక్షణ కేంద్రానికి వెళ్లి విద్యార్థులందరికీ 'నీతి కథలు' పుస్తకాలు, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్లు, బిస్కెట్లు పంచిపెట్టారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వ్యాసరచన, మరియు వక్తత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బాలల హక్కుల కమీషన్ చైర్మన్ కేసలి అప్పారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.